నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక 54 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | ఆగస్టు 22, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

గణితమనగనెపుడు కఠినమ్ము గాదండి
సలుపుచుండనదియు సులువునగును
రాదుననుచు మనసు రానీయబోకుము
బ్రతుకు లోన నదియు భాగమేను
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.


## రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

**- అందుకే సిఎం రేవంత్ పర్యటనకు అనుమతి నిరాకరణ**
**- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వివరణ**



**న్యూఢిల్లీ,ఆగస్టు 21 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో మిగతా2లో...



## చిత్ర పరిశ్రమలో విషాదం..

**దిగ్గజ నటి 'షావుకారు జానకి' కన్నుమూత!**

**హైదరాబాద్,ఆగస్టు 21 :**భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసిన అలనాటి ప్రముఖ సీనియర్ నటి 'షావుకారు' జానకి (94) తుదిశ్వాస విడిచారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత మిగతా2లో...

## గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**- అధికారులకు సంజయ్ జాజు ఆదేశం**



**హైదరాబాద్,ఆగస్టు 21 :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ ? ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మిగతా2లో...

## తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

**హైకోర్టులో ముగిసిన వాదనలు: 16న తీర్పు వెలవరించనున్న హైకోర్టు**




## పెల్లెట్ గన్స్ ఉదంతంపై కేసు నమోదు



**న్యూఢిల్లీ,21:**ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. తాజాగా రాహుల్ గాంధీ డిమాండ్ మేరకు పెల్లెట్ గన్స్ ఉదంతంపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. బాధితుని వైద్య నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయనున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెలువరించాయి. గత నెల జూలై 20న నీట్ పేపర్ లీక్ ను వ్యతిరేకిస్తూ విద్యార్థులు పార్లమెంట్ మార్చ్ కు శాంతియుత నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. విద్యార్థులపై పెల్లెట్ గన్ లతో భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో 19 ఏళ్ల సాహిల్ కు తీవ్ర గాయాలైయ్యాయి. బాధిత యువకుడితో కలిసి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ మిగతా2లో...



## క్రమశిక్షణా కమిటీకి చెప్పాల్సింది చెప్ప..

**- కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు: కొండా సురేఖ**

**హైదరాబాద్,ఆగస్టు 21 :** కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మీడియాతో మాట్లాడబోనని చెప్పారు. 'నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ మిగతా2లో...

## ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

**సవాళ్లను అవకాశంగా మార్చుకోవాలి: వర్క్‌షాపులో పలువురు మంత్రుల సూచన**







## జిఓ 150ను రద్దు చేయాలి: కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,ఆగస్టు 21 :** తెలంగాణ స్థానిక విద్యార్థులకే ఎంబిబిఎస్ సీట్లు కేటాయించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శుక్రవారం నీట్ ర్యాంకులు సాధించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు కవితతో భేటీ అయ్యారు. ప్రభుత్వం 2024లో తీసుకువచ్చిన 150 జిఓ కారణంగా ఇతర రాష్ట్రాలకు మిగతా2లో...

## ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

**ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేయాలి: మంత్రి సీతక్క వెల్లడి**




## హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

**- జీవిత ఖైదును రద్దు చేసిన సుప్రీం కోర్టు**

# హత్య కేసులో 105 ఏళ్ల వృద్ధుడికి ఊరట

**న్యూఢిల్లీ,ఆగస్టు 21 :**హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని మల్డ జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు. 1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది.

తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్‌కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్‌కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.

# జిఒ 150ను రద్దు చేయాలి: కల్వకుంట్ల కవిత

(మొదటి పేజీ తరువాయి)

చెందిన విద్యార్థులకు ఎక్కువ సీట్లు వస్తున్నాయని.. ఫలితంగా తెలంగాణ ప్రాంత బిడ్డలకు అన్యాయం జరుగుతోందని వివరించారు. కవిత స్పందిస్తూ, వారం రోజుల్లో ఎంబిబిఎస్ సీట్లు అలకేట్ చేసే అవకాశ ఉండటంతో ప్రభుత్వం తెలంగాణ స్థానిక విద్యార్థులకు అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే విద్య సంవత్సరం నాటికి తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేసే జిఒ 150ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు నాలుగేళ్లు తెలంగాణలో చదివితే స్థానికత వర్తించేలా జిఒ 150 తేవడంతో ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి చదువుతోన్న విద్యార్థులకే ఎక్కువ ఎంబిబిఎస్ సీట్లు దక్కుతున్నాయని తెలిపారు. ఏటా సుమారు 1,500 నుంచి 2 వేల సీట్లు ఇతర రాష్ట్రాల విద్యార్థులకే దక్కుతున్నాయని, ఆ మేరకు తెలంగాణ విద్యార్థులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఏడేళ్లు ఏ రాష్ట్రంలో జరిగితే అక్కడ స్థానికత వర్తించేలా పాత జిఒను పునరుద్ధరించాలని సూచించారు. నీట్ కారణంగా ఇప్పటికే 15 శాతం సీట్లు కోల్పోతున్నామని, ఏ రాష్ట్రంలో మెడికల్ సీట్ల భర్తీకి ఆ రాష్ట్రమే ఎంట్రన్స్ నిర్వహిస్తే సీట్లు కోల్పోవాల్సిన ఆస్కారమే ఉండదన్నారు. విద్యార్థుల భవిష్యత్ ముడిపడి ఉన్న ఈ అంశం అత్యంత సెన్సిటివ్ అని.. ప్రభుత్వం వారం రోజుల్లో ఒక నిర్ణయం తీసుకోకుంటే తెలంగాణ విద్యార్థులకు మళ్లీ అన్యాయం జరుగుతుందనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ రెడ్డి వెంటనే ఈమేరకు చర్యలు చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

సీఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మిట్ నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షించారు. దేశంలోని వివిధ దేశాల రాయబారులు, హైకమిషనర్లకు ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, ఆయా దేశాల్లోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సీఎస్ సూచించారు. అదేవిధంగా, దేశంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, శాస్త్ర?సాంకేతిక, వైద్య, విద్య, మౌలిక వసతులు తదితర రంగాల ప్రముఖులను సమ్మిట్‌లో పాల్గొనేలా ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రతి కమిటీకి స్పష్టమైన బాధ్యతలను అప్పగించి సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా వివిధ రంగాలకు సంబంధించిన ఎక్స్‌పోలను ఏర్పాటు చేయాలని, వాటిలో ప్రముఖ కంపెనీలు, సంస్థలు భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ పేర్కొన్నారు. అలాగే, తెలంగాణ రైజింగ్ ? ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు మార్గదర్శకత్వం అందించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులతో కూడిన సలహా మండలి ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించి, తెలంగాణను ప్రపంచస్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్ఠించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శ్రీ శశాంక, పరిశ్రమలశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందాం

**హైదరాబాద్,ఆగస్టు 21 :**ఎల్‌నినో ప్రభావంతో రానున్న సవాళ్లను ముందుగానే గుర్తించి తెలంగాణ రాష్ట్రాన్నిఅన్ని విధాలుగా సన్నద్ధం చేయాల ని పలువురు మంత్రులు అధికారులకు సూచించారు. ఎల్‌నినో సాధారణ పరిస్థితి కాదని, ముఖ్యంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో పంటలు చేతికొచ్చే సమయంలో నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లో ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమీకృత వ్యవసాయ కుంటల పాత్రపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, వ్యవసాయం, పశుసంవర్ధక, పంచాయతీరాజ్ శాఖల సెక్రటరీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాకా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, ఈ విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమావేశం ఏర్పటు చేయడం హర్షనీయమని అన్నారు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరిగే స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని, ప్రధాన జలాశయాల్లోకి కూడా ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో అందుబాటులో ఉండే భూగర్భ జలాలపై రోజువారీగా అంచనాలు రూపొందించి, వాటిని జాగ్రత్తగా వినియోగించేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆటో స్టార్టర్లతో రేయింబవళ్లు మోటార్లు నడిపి భూగర్భ జలాలను వృథా చేయకుండా, పంటకు అవసరమైన మేరకే నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునేలా రాష్ట్రంలోని 44 వేల చెరువులను సంరక్షించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. చెరువుల్లోకి వర్షపు నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టి, వాటిలో నీటిని నిల్వ చేస్తే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. వాగులు, నదుల్లో అవసరమైన ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాల నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చన్నారు. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను సవాలుగా కాకుండా అవకాశంగా మలచుకోవాలని మంత్రి అన్నారు. కొత్త సాంకేతికత కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, గతంలో మన తాతలు, తండ్రులు అనుసరించిన నీటి సంరక్షణ పద్ధతులను తిరిగి ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి విపత్కర పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. జిల్లా స్థాయిలో అధికారులు ప్రతిరోజూ సమన్వయ సమావేశాలు నిర్వహించి తమ జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని మంత్రి సూచించారు. మండల స్థాయిలో మండల అధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, ప్రజలకు అధికారులు నమ్మకమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే అధికారుల మాటను రైతులు, ప్రజలు విశ్వసిస్తారని, అధికారులు ప్రజలతో మానవీయ కోణంలో వ్యవహరించాలని అన్నారు.

# క్రమశిక్షణా కమిటీకి చెప్పాల్సింది చెప్పా..

(మొదటి పేజీ తరువాయి)

కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను'అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని అందులో కోరారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

**హైదరాబాద్,ఆగస్టు 21 :**ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకమైనదని ఈ సందర్భంగా మంత్రి సీతక్క అభివర్ణించారు. మీరు ఎక్కువ సంఖ్యలో కూలీలను నమోదు చేసి.. వారితో పనులు చేయించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు రెండు లక్షల కంటే తక్కువగా కూలీల నమోదు ఉందని వివరించారు. శుక్రవారం హైదరాబాద్ లో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్‌లను విధుల నుంచి తప్పించిందని మండిపడ్డారు. వారిని తిరిగి ఫీల్డ్ అసిస్టెంట్లుగా తమ ప్రభుత్వం విధుల్లోకి తీసుకుందని గుర్తు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల మధ్య వేతనంలో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ సైజు, పనుల కల్పనకు ముడి పెట్టకుండా ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ ఒకే విధంగా వేతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని భరోసా కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు.. తమను ఎఫ్‌టీఈలుగా గా కన్వర్ట్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో చర్చించి.. త్వరలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. ఆ సంఖ్యను కనీసం12 లక్షలకు పెంచాల్సిన అవసరం ఉందని సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు కూలీలతో పనులు చేయించినప్పుడు.. మనం ఎందుకు చేయించ లేకపోతున్నామని ఫీల్డ్ ప్రతినిధుల బృందాన్ని మంత్రి సీతక్క సూటిగా ప్రశ్నించారు.

# చిత్ర పరిశ్రమలో విషాదం..

(మొదటి పేజీ తరువాయి)

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు.

అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పెల్లెట్ గన్స్ ఉదంతంపై కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తన ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని సాహిల్ ఆరోపించాడు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు.కేసు నమోదు చేసేవరకు స్టేషన్ నుంచి కదిలేది లేదని, నెల రోజులైనా, ఆరు నెలలైన ధర్నా చేస్తానని రాహుల్ గాంధీ భీష్మించారు.

మరోవైపు ఆనాటి ఘటనపై సుప్రీంకోర్టు గురువారం ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని (హెచ్‌పిఇసి) ఏర్పాటు చేసింది.

ఈ కమిటీకి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నేతృత్వం వహిస్తున్నారు .ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఈ కమిటీలో పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రవిశంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శాలిందర్ కౌర్, మాజీ సీబీఐ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, రిటైర్డ్ మేఘాలయ డీజీపీ ఎల్.ఆర్. బిష్ణోయ్ కూడా సభ్యులుగా ఉంటారని తెలిపింది.

# రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇవ్వం

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. 10 రోజుల విదేశీ పర్యటన కోసం సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కోసం న్యూఢిల్లీ వెళ్లిన ఆయన బుధవారం అర్ధరాత్రి తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ముందుగా అనుకున్న ప్రకారం.. ఆగస్టు 30వ తేదీ వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించ నుంది. ఈ రెండు దేశాల్లోని వివిధ యూనివర్సిటీలను సందర్శించి తెలంగాణలో ఉన్నత విద్య, క్రీడల అభివృద్ధిపై ఈ బృందం చర్చించనుంది. అలాగే లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో పాల్గొనుంది. అనంతరం యూఎస్‌కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వ లేదు. దాంతో ఆయన లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే యూఎస్ పర్యటనకు వెళ్లాలని అధికారుల బృందాన్ని సీఎం రేవంత్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు

**హైదరాబాద్,ఆగస్టు 21 :** తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయ వాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచా రం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు. ఏఐసీసీ అధికారిక కార్యక్రమాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలు పాల్గొన్నారని, వీరి వీడియోలు ంఃఔ ఆంధ్రజ్యోతిలో ప్రసారం అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియో లను కూడా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు హైకోర్టు పేర్కొంది.

# కక్షతోనే అడ్డుకున్నారు: మంత్రి వాకిటి



**హైదరాబాద్,ఆగస్టు 21 :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు రాజకీయ కక్షతోనే కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. సిఎం అమెరికా పర్యటనకు అ నుమతి నిరాకరణపై కేంద్ర మంత్రు లు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ప్రజలకు సమాధానం చె ప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. పేద, బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాల పిల్లలకు ప్రపంచస్థా యి విద్యను అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమం త్రి అమెరికా పర్యటనకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సి ఎం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అడ్డంకులు సృష్టించడంద్వారా తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోలేరని వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుపై రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణకు ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలను తీసుకురావడం, విద్యా రంగంలో పెట్టుబడులు, అత్యుత్తమ విద్యా సంస్థల భాగస్వామ్యాలను రాష్ట్రానికి తీసుకురావడం వంటి అంశాల పై చర్చించాలన్నది సీఎం లక్ష్యమని పేర్కొన్నారు. అ మెరికా పర్యటనకు సంబంధించిన అన్ని వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే కేంద్ర ప్రభుత్వానికి అ ధికారికంగా పంపించినప్పటికీ అనుమతి నిరాకరించడం దురదృష్టకరమని మంత్రి అన్నారు.

## వాయనాలు ఇచ్చిపుచ్చుకున్న మహిళలు



ఖానాపూర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ఖానాపూర్ పట్టణంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. పూజకు సంబంధించిన వస్తువులను ముందురోజే సిద్ధం చేసుకుని, ఉదయం అమృత ఘడియల్లో ఇంటిని శుభ్రపరచి అభ్యంగన స్నానాలు చేసి, కొత్త వస్త్రాలు ధరించి వ్రతాన్ని నిర్వహించారు. కొందరు పూజారులచే వ్రతకథను వినిపించుకున్నారు.అధిక సంఖ్యలో మహిళలు ఇంట్లోనే పూజలు చేసి, బంధువులను పిలిచి వాయనాలు ఇచ్చుకున్నారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎనగందుల నారాయణ ఇంటిలో మహిళలు రుక్మిణి, అలేఖ్య తదితరులు వాయనాలు మార్చుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కూడా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు.

## మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోయాం ఆటో డ్రైవర్లు




పెద్దపల్లి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లు, ఓనర్ల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు.పెద్దపల్లి బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు సుమారు 300 ఆటోలతో ర్యాలీ చేపట్టి, అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవి కుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు వ్యాళ్ళ హరీష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకపోతే ఈ నెల 24 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. అదే రోజు రాష్ట్రంలోని జాతీయ రహదారులను దిగ్బంధం చేస్తామని తెలిపారు.మహాలక్ష్మి పథకం కారణంగా ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఏటా రూ.12 వేల ఆర్థిక సహాయం హామీని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె తప్పదని స్పష్టం చేశారు.

## రూప రెడ్డి హత్యపై కఠిన చర్యలు తీసుకోవాలి విద్యాసంస్థల చైర్మన్



పెద్దపల్లి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :నల్లగొండలో జరిగిన రూపారెడ్డి హత్యకు నిరసనగా పెద్దపల్లి జిల్లాలోని పాఠశాలలు బంద్ నిర్వహించాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా సంతాప సూచకంగా బంద్‌లో పాల్గొన్నాయి.ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ పెద్దపల్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మైనర్ల చేత ఉపాధ్యాయులపై దాడులు జరగడం సమాజంలో ఆలోచనా విధానం మారుతున్న సంకేతమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ చూపి, చెడు అలవాట్లకు దూరంగా ఉంచాలని సూచించారు.ఉపాధ్యాయులకు తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని, హాస్పిటల్స్‌లో డాక్టర్లకు ఉన్న చట్టపరమైన రక్షణల మాదిరిగానే పాఠశాలల్లో ఉపాధ్యాయులకు కూడా రక్షణ చట్టం ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.రూపారెడ్డి హత్యకు బాధ్యులను వెంటనే కఠినంగా శిక్షించాలని, ఉపాధ్యాయుల భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యాసంస్థల చైర్మన్ స్పష్టం చేశారు.

## రాకెట్‌బాల్‌లో ప్రతిభ చాటిన అల్ఫోర్స్ విద్యార్థి




కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థి నాగ విగ్నేష్ రాకెట్‌బాల్‌లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు.ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నాగ విగ్నేష్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గర్వకారణమని ఆయన అన్నారు.క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, క్రీడా ప్రతిభ ఉన్న విద్యార్థులకు భవిష్యత్‌లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఇటీవల కరీంనగర్ జిల్లా శివారులో నిర్వహించిన అంతర్‌జిల్లా రాకెట్‌బాల్ పోటీల్లో నాగ విగ్నేష్ ప్రతిభ కనబరిచి, త్వరలో తమిళనాడులో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు.విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని, అవసరమైన శిక్షణ వనరులు కల్పిస్తామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని నాగ విగ్నేష్‌ను అభినందించారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యం వెలిచాల రాజేందర్‌రావు



కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : గ్రామాల అభివృద్ధికి శాతం శాతం కృతనిశ్చయంతో పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. సర్పంచులు పిలిస్తే గ్రామాల్లో వాలిపోయి ప్రజల అవసరాలను తెలుసుకుని త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.జూబ్లీ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం సర్పంచ్ సుద్దాల కమలాకర్‌గౌడ్, ఉప సర్పంచ్ కచ్చు రజితతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామాలను భావితరాలకు ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల మధ్యే ఉంటానని తెలిపారు.గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పెద్దఎత్తున సాధించేందుకు కృషి చేస్తానని, జూబ్లీ నగర్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని హామీ ఇచ్చారు. సర్పంచ్ కమలాకర్‌గౌడ్ యువ ఉత్సాహవంతమైన నాయకుడిగా గ్రామాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నారని ఆయన ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఆకుల నర్సన్న, బోగొండ ఐలయ్య, బొద్దుల లక్ష్మీనారాయణ, తిరుపతిరెడ్డి, జగ్గాని కనుకయ్య, జక్కం నర్సయ్య, గంగయ్య, మీసాల శంకర్, దావు మల్లయ్య, కాశిపాక రాకేష్, అనంతుల రమేష్, మూల కృష్ణారెడ్డి, ఆట్టేపు వేణు, పోరండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీఎన్జీఓస్ జెండా, కండువా, ఉద్యోగ గొంతుక ఆవిష్కరణ




పెద్దపల్లి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : టీఎన్జీఓస్ జిల్లా ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో అధికారిక జెండా, సంఘ కండువా, ఉద్యోగ గొంతుక మాసపత్రికలను ఘనంగా ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యరెడ్డి సందీప్ రెడ్డి, అనుబంధ సంఘాల నాయకులు, ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బొంకూరి శంకర్ మాట్లాడుతూ టీఎన్జీఓస్ జెండా ఉద్యోగుల ఐక్యతకు ప్రతీకగా, సంఘ కండువా ఉద్యమ స్ఫూర్తికి గుర్తింపుగా నిలుస్తుందని తెలిపారు. కండువాలో ఎరుపు రంగు ఉద్యమానికి, నీలి రంగు సమ సమాజ స్థాపనకు, తెలుపు రంగు శాంతి, సమయస్ఫూర్తికి సూచనలని వివరించారు. ఉద్యోగ గొంతుక మాసపత్రిక ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే శక్తివంతమైన వేదికగా నిలుస్తుందని అన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యరెడ్డి సందీప్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించడం నేటి అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి టీఎన్జీఓస్ జెండా కింద సంఘటితమై ఉద్యమ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఆగస్టు 27న జిల్లా కేంద్రంలో మహా ధర్నా, సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం నిరసన, సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ మహా ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోపు అనిత, కొమురయ్య, ఆడెపు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, ప్రవీణ్, సౌమ్య, స్వప్న, అడ్ల పురుషోత్తం రెడ్డి, నూకల శంకర్, జగన్, సరిత, నాయిని భాగ్యమ్మ, రాజీ రెడ్డి, సందీప్ రావు, రాజ ప్రసాద్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బీజేపీ డొల్ల ప్రచారం చేస్తుంది

– బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి



కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటుంటే బీజేపీ నేతలు వాస్తవాలను వక్రీకరించడం సరికాదని రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు.శుక్రవారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద వర్గాల విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం రూ.2,400 కోట్లు కేటాయించి అందులో రూ.2,050 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో బకాయిలు పేరుకుపోయాయని, రైతుబంధు తరహాలో విద్యార్థుల ఖాతాల్లోకే నేరుగా నిధులు జమ చేసే విధానం చారిత్రాత్మకమని పేర్కొన్నారు.ఫీజు బకాయిల కారణంగా విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయడం వల్ల ఉన్నత విద్య, ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు దెబ్బతిన్నాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కళాశాలలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కాంగ్రెస్ హయాంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. బీజేపీ నేతలు ముందుగా తమ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకం ఎక్కడ అమలవుతోందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్రం అందిస్తున్న నిధుల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని విమర్శించారు.కరీంనగర్ ఆర్‌ఓబీ పనులు ఏడాది గడిచినా పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా రోగులు, అంబులెన్స్‌లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా యని తెలిపారు. కేంద్ర––రాష్ట్ర ఆరోపణలు మానేసి ఆర్‌ఓబీ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో రెహమత్ హుస్సేన్, ఎం.డి. తాజ్, వెన్నం రజిత రెడ్డి, మాదాసు శ్రీనివాస్, చింతల్ కిషన్, కూడలి శ్రీధర్, అబ్దుల్ రెహమాన్, అమీర్, కుంభాల రాజు కుమార్, సామ్రాట్, బొమ్మరాతి సాయి తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకందారుల అభ్యున్నతే లక్ష్యం వెలిచాల రాజేందర్‌రావు



కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : గొర్రెల పెంపకందారుల సంక్షేమం కోసం నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సూచించారు. తీగలగుట్టపల్లిలోని ఆయన స్వగృహంలో కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా యూనియన్ లిమిటెడ్ నూతన పాలకవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావును శాలువాతో సత్కరించి పూలబొకే అందజేశారు.నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన రాజేందర్‌రావు మాట్లాడుతూ సహకార సంఘాన్ని బలోపేతం చేస్తూ సభ్యుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అవకాశాలు పూర్తిస్థాయిలో అందేలా పాలకవర్గం చొరవ తీసుకోవాలని అన్నారు.గొర్రెల పెంపకందారుల అభ్యున్నతి కోసం చేపట్టే కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నూతన చైర్మన్ బాషవేణి మల్లేశం యాదవ్, వైస్ చైర్మన్ చిగుర్ల శ్రీనివాస్ కురుమ, డైరెక్టర్లు అగిత రవీందర్, కాల్వ సురేష్ యాదవ్, చొటపల్లి రంజిత్ యాదవ్, జిల్లెల్ల పరశురాములు యాదవ్, దాడి ఆంజ నేయులు యాదవ్, దాడి సదయ్య యాదవ్, దానె ఒదేలు కు రుమ, బండి మల్లయ్య యాదవ్, ముక్కెర సదానందం యా దవ్, సందబోయిన ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గొట్టిముక్కుల సురేష్ రెడ్డి జన్మదిన వేడుకలు




సుల్తానాబాద్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : సుల్తానాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు సౌదరి మహేందర్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ఈ వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.సురేష్ రెడ్డి పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తూ, కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారని కందుల శ్రీనివాస్, మహేందర్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో బీజేపీ మరింత బలపడాలని ఆకాంక్షించారు.నాయకులు, కార్యకర్తలు సురేష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మేకల కార్తీక్ యాదవ్, కోట నాగేశ్వరరావు, కొల్లూరి సంతోష్ కుమార్, మెండే శంకరయ్య, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, మల్క భాగ్యలక్ష్మి, వడ్లకొండ మహేష్ గౌడ్, మానుపటి బాలకృష్ణ, ఉషణ అన్వేష్ యాదవ్, ఎర్రం సంతోష్ రెడ్డి, నల్లవెల్లి శంకర్, కనుకుంట్ల జోగేందర్, దాసరి పూర్ణచందర్, అబ్బోజు రాజా నందం, నూనె మహేష్ పటేల్, వారికిల్లా నాగభూషణం, శేఖర్ మాస్టర్, పర్శరాములు, కరెంగుల హరీష్, ఆకుల లక్ష్మణ్, నేరెళ్ల శ్రీనివాస్, సుబ్బని సురేష్, మీస మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శక్తి స్కీం పాలిటెక్నిక్ విద్యార్థులకు శాపం ఎస్‌ఎఫ్ఐ




కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జీవో నం. 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి జరిగింది. అనంతరం పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేశారు.ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులను ఐటిఐ, ఏటిసి లతో అనుసంధానం చేయడం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే నిర్ణయమని అన్నారు. పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్తోందని విమర్శించారు.స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు శక్తి స్కీం పేరుతో విద్యను కార్పొరేట్ వైపు మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.జీవో నం. 97ను ఉపసంహరించుకోవాలని, పాలిటెక్నిక్ కళాశాలలకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజన, గర్ల్స్ కన్వీనర్ మానస, ఉపాధ్యక్షులు వినయ్ సాగర్, భోగేశ్వర్, సభ్యులు సన్నీ, సందేశ్, రాకేష్, అభిషేక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



వేములపల్లి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్ ప్రెస్): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజా సంక్షేమం మరియు గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) అన్నారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దావాఖాన, మహిళా సంఘ భవనం, అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఆర్డీఓ రమణారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడం, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్యా వాతావరణం కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు.

పల్లె దావాఖాన అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు స్థానికంగానే లభిస్తాయని తెలిపారు. ఆరోగ్య అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయని పేర్కొన్నారు.

మహిళా సంఘ భవనం మహిళల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి వేదికగా నిలుస్తుందని చెప్పారు. స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, ఉపాధి అవకాశాల విస్తరణ, ఆర్థిక సాధికారత కార్యక్రమాలకు ఈ భవనం దోహదపడుతుందని వివరించారు.

అలాగే అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య పరిరక్షణ సేవలు మరింత మెరుగైన వాతావరణంలో అందనున్నాయని తెలిపారు. బాలల సమగ్ర వికాసానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శెట్టిపాలెం గ్రామ అభివృద్ధికి సంబంధించిన ఇతర సమస్యలను కూడా గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేస్తూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక




## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి డివైఎఫ్ఐ



**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, బెట్టింగ్ యాప్స్ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని హెచ్చరించారు. వీటికి బానిసలైతే విద్య, ఉద్యోగం, కుటుంబ జీవితం దెబ్బతినడంతో పాటు ఆర్థిక, మానసిక సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వాలు యువతకు ఉపాధి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. ఇటీవల నల్గొండలో జరిగిన ప్రిన్సిపాల్ హత్య ఘటనను ప్రస్తావిస్తూ మత్తు పదార్థాల వినియోగం, సోషల్ మీడియా ప్రభావం, అసాంఘిక ధోరణులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్ యాప్స్ నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యా సంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి. సురేష్, డి. నరేష్ పటేల్, మండల నాయకులు ప్రకాష్, దేవిశ్రీ, సంతోష్ కుమార్, శ్రీధర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ డిమాండ్



**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ కలెక్టరేట్‌లో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 22ఏ నిషేధిత భూముల జాబితా అక్రమాలపై వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ వేలాది మంది రైతులు, భూ యజమానుల ఆస్తి హక్కులను కాలరాసిన ఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని కోరారు. ధరణి, భూభారతి పోర్టల్స్‌లో జరిగిన మార్పులపై డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని, కరీంనగర్ జిల్లాలోని 22ఏ భూముల వివరాలను మండలాల వారీగా బహిర్గతం చేసి శ్వేతపత్రం విడుదల చేయాలని సూచించారు. తప్పుగా జాబితాలో చేరిన ప్రైవేటు, పట్టా భూములను తొలగించి బాధితులకు న్యాయం చేయాలని, రికార్డులను మార్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతుల తరఫున పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, బిజెపి, బిజెవైఎం, కిసాన్ మోర్చా నాయకులు, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు రక్షణ చట్టాలు కల్పించాలి

- ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు నిరసనగా ర్యాలీ
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు




**వనపర్తి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ జిల్లాలో ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ వనపర్తిలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయ బృందాలు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించాయి. ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించాయి. పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద ఉపాధ్యాయులు, విద్యా సంస్థల ప్రతినిధులు ఆందోళన చేపట్టి రూపారెడ్డి హత్యను ఖండించారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయులకు తగిన భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ట్రాస్మా అధ్యక్షుడు గంగవరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన రక్షణ చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించే సమయంలో భయాందోళనలకు గురికాకుండా సురక్షిత వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యా రంగంలో సేవలందిస్తున్న ఉపాధ్యాయుల గౌరవం, భద్రత పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ వాసవి మాత ఆలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం



**మర్రిగూడ, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఆచరించే వరలక్ష్మీ వ్రతం హిందూ సంప్రదాయంలో అత్యంత విశిష్టమైనదిగా భావిస్తారు. కోరిన వరాలను ప్రసాదించే తల్లిగా శ్రీ మహాలక్ష్మీదేవిని ఆరాధిస్తూ మహిళలు ఈ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించడం ద్వారా కుటుంబాలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు, శాంతి కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం వరలక్ష్మీదేవికి నైవేద్యాలు సమర్పించి హారతులు ఇచ్చారు. వరలక్ష్మీదేవిని పూజించడం ద్వారా అష్టలక్ష్ములను పూజించిన ఫలితం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయని పండితులు వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి (ఏసీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు బురుగు నాగరాజు గుప్త, వనమా వెంకటేశ్వరరావు, వనమా భానుమతి, మిరియాల విమల, దుగ్గి ఝాన్సీ, మంచుకొండ కనకదుర్గ, అర్థం సరిత, అర్థం లక్ష్మి, బచ్చు భాగ్యమ్మ, మిరియాల పావని తదితరులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత కిట్ బ్యాగుల పంపిణీ



**మంచాల, ఆగస్టు 21 (ప్రతినిధి):** విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో మంచాల మండలంలో ఉచిత కిట్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో, టాలెంట్ ఫార్ములా అడ్వైజరీ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా సామగ్రితో కూడిన కిట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల చదువుకు అడ్డంకిగా మారకుండా చూడడం, వారిలో విద్యపై ఆసక్తి పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా టాలెంట్ ఫార్ములా సంస్థ సీఓఓ క్రాంతి కిరణ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, వారి విద్యా ప్రగతికి తమవంతు సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు భవిష్యత్తులోనూ తమ సంస్థ కట్టుబడి ఉంటుందని తెలిపారు.
ఏకలవ్య ఫౌండేషన్ కార్యదర్శి నరేంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉచిత కిట్ బ్యాగుల పంపిణీ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా, వారి విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఉదారంగా సహకరించిన టాలెంట్ ఫార్ములా సంస్థకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు బలోపేతమే సమాజ అభ్యున్నతికి పునాది అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి విద్యారంగానికి చేయూతనివ్వడం ఆదర్శప్రాయమని కొనియాడారు.
కార్యక్రమంలో క్రాంతి కిరణ్, క్రిస్, రిచర్డ్, దివ్య, స్నేహ, శ్రీకర్, ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టీ రవీందర్, ప్రాజెక్ట్ మేనేజర్ ప్రశాంత్, పుల్లారెడ్డి, శంకర్, బాల్‌రాజ్, జగదీశ్, మంచాల మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బంగారు మైసమ్మ అమ్మవారికి బంగారు ముక్కుపుడక సమర్పణ

- శ్రావణ శుక్రవారం సందర్భంగా కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేసిన మాజీ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్




**బోడుప్పల్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రావణ మాసంలోని పవిత్ర శుక్రవారం సందర్భంగా బోడుప్పల్‌లోని ప్రసిద్ధ శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారికి మాజీ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి బంగారు ముక్కుపుడకను సమర్పించారు.
ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో మొక్కులు తీర్చుకున్న వెంకటేష్ యాదవ్, బంగారు ముక్కుపుడకను సమర్పించి తన భక్తిని చాటుకున్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బంగారు మైసమ్మ అమ్మవారిపై తమ కుటుంబానికి అపారమైన భక్తి, విశ్వాసం ఉందన్నారు. అమ్మవారి కరుణా కటాక్షాలు బోడుప్పల్ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు.
కార్యక్రమం అనంతరం ఆలయ పూజారులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో రాసాల సుస్మిత పృథ్వీ యాదవ్, రాసాల మౌనిక శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్, రాసాల నర్సింగ్‌రావు యాదవ్, రాసాల బాలమల్లేష్ యాదవ్, రాసాల శ్రీశైలం యాదవ్, రాసాల సత్యనారాయణ యాదవ్, రాసాల రమేష్ యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు దేవరకొండ వీరాచారి, సామల జయేందర్ రెడ్డి, జనిగె బంగారు యాదవ్, జనిగె అంజనేయులు యాదవ్, కొండా రాంచందర్ యాదవ్, రాపోలు శంకరయ్య, మన్నె ప్రభాకర్ రెడ్డి, యర్రగుండ్ల సత్యమూర్తి యాదవ్, కొత్త కిరణ్ గౌడ్, శ్రీరాముల జ్ఞానేశ్వర్, పన్నాల జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా నూతన కమిటీ ఏర్పాటు



**సుల్తానాబాద్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి జిల్లా ఏఐటీయూసీ నాలుగో మహాసభలు సుల్తానాబాద్‌లోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు ప్రకటించిన నూతన కమిటీలో జిల్లా అధ్యక్షుడిగా వైవీ రావు, ప్రధాన కార్యదర్శిగా కడారి సునీల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పూసల రమేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కే. రాజారత్నం, జూపాక రామచందర్, సహాయ కార్యదర్శులుగా నాంసాని శంకర్, శనిగరపు చంద్రశేఖర్, నూనేటి రాధమ్మ, కోశాధికారిగా రెడ్డపాక లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. మొత్తం 35 మంది కౌన్సిల్ సభ్యులు, 17 మంది కార్యవర్గ సభ్యులు, 9 మంది ఆఫీస్ బేరర్స్‌తో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు బాలరాజు తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తనను మరోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు కడారి సునీల్ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ, సహకరించిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు



**సుల్తానాబాద్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామంలో శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవస్థాన పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, జలాధివాసం, ప్రదోష పూజలతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగనున్నాయి. పునఃప్రతిష్ఠాపన మహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో భక్తులతో సందడి నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ ఓగుల పూజా రాజేందర్, తాళ్లపల్లి మనోజ్ గౌడ్, ఆనందరావు, రాజ మల్లయ్యతో పాటు గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. మహోత్సవాలను విజయవంతం చేసేందుకు గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## అక్రమంగా తరలిస్తున్న 20 పశువులకు విముక్తి



**జమ్మికుంట/సుల్తానాబాద్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జమ్మికుంట మండలం గండ్రపల్లి సమీపంలో ట్రాలీలో 20 పశువులను అక్రమంగా తరలిస్తున్న ఘటన బయటపడింది. గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లతో కలిసి పంచాయతీ కార్యదర్శి స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రామకృష్ణ, ఎస్ఐ రవి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇందిరానగర్‌కు చెందిన రాజుతో పాటు మరో ఇద్దరిని ప్రశ్నించారు. ఫిర్యాదు మేరకు జంతు హింస నివారణ చట్టం కింద కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ దర్యాప్తు ప్రారంభించారు. ట్రాలీలో ఉన్న 20 పశువుల్లో 10 ఆవులు, 5 లేగ దూడలు, 5 మగ దూడలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తరువాత పశువులను సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర గోశాలకు తరలించారు. పశువులను అక్రమంగా తరలించడం, హింసకు గురిచేయడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు.

## ఎక్సైజ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు



**పెద్దపల్లి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా డీటీఎఫ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శిరీష ఫలితాలను ప్రకటించారు. అధ్యక్షుడిగా హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, జనరల్ సెక్రటరీగా సౌకత్ అలీ, కోశాధికారిగా విష్ణువర్ధన్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా ప్రశాంత్, మహిళా సమైక్య కార్యదర్శిగా తిరుమల, పబ్లిసిటీ సెక్రటరీగా సురేష్ బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులుగా శిరీష, సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, సిబ్బంది సంక్షేమమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ఎన్నికల కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాస్, స్రవంతితో పాటు ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఆలే నరేంద్ర జయంతి వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పద్మశాలి సంక్షేమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ కేంద్ర మంత్రి ఆలే నరేంద్ర 80వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ట్రస్ట్ హాస్టల్‌లో విద్యార్థులు, నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వాసాల రమేష్, ట్రస్ట్ అధ్యక్షుడు స్వర్గం మల్లేశం మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో ఆలే నరేంద్ర చేసిన పోరాటాలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలంగాణ సాధన సమితి ద్వారా ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. హైదరాబాదులో జన్మించిన ఆలే నరేంద్ర మూడు సార్లు ఎమ్మెల్యేగా, పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా ప్రజా సమస్యలను జాతీయస్థాయిలో ప్రస్తావించారని, బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడారని నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అల్స భద్రయ్య, వోడ్నాల రవీందర్, మార్త ప్రకాష్, స్వర్గం నర్సయ్య, వంగర ఆంజనేయులు, రుద్ర పరమ్, మెతుకు వంశీకృష్ణ, జక్కని ప్రభాకర్, వేముల చంద్రశేఖర్, పాము రాజేశం, దేవసాని పాపయ్య, చిలుక నర్సప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
శనివారం,
ఆగస్టు 22, 2026



## 22ఏ భూముల సమస్య పరిష్కారానికి మంత్రి హామీ




**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్‌లో 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న బాధితులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు రాష్ట్ర మంత్రి పొం గులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. జగిత్యాలలో మంత్రిని కలసి వినతిపత్రం అందజేసిన రాజేందర్‌రావు, రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి ప్రాంతాల్లో వేలాది మంది నిషేధిత జాబితా కారణంగా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సుమారు 230 సర్వే నంబర్లలో 1000 ఎకరాలకు పైగా భూములు జాబితాలో ఉండటంతో ఇళ్లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలిపారు.మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించి సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశించారు. కలెక్టర్ కూడా సమస్య పరిష్కారానికి చొరవ చూపుతున్నారని రాజేందర్‌రావు తెలిపారు.అర్హత ఉన్న భూములను పరిశీలించి 22ఏ జాబితా నుంచి తొలగించేలా త్వరలోనే మంచి నిర్ణయం వస్తుందని, బాధితులు ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు.

## బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**హుస్నాబాద్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** హుస్నాబాద్ పట్టణ ఆరో వార్డులో బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.సమత ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సమత తన బృందంతో కలిసి ప్రజలకు రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు పరీక్షించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమానికి 6వ వార్డు కౌన్సిలర్ భూక్య సంపత్ నాయక్ హాజరై డాక్టర్ సమత, వైద్య బృందం అందిస్తున్న సేవలను అభినందించారు.బాలవికాస సమన్వయకర్తలు జ్యోతి, నిర్మల, శ్రీమతి, సభ్యులు డి. లక్ష్మి, పి. లత, పి. వసంత, వనజ, జి. లక్ష్మి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## సరస్వతి శిశు మందిర్‌లో ఘనంగా వరలక్ష్మి వ్రతం వేడుకలు



**హుస్నాబాద్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో వరలక్ష్మి వ్రతాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పోషకులు, పూర్వ విద్యార్థులు, మాతాజీలు కలిసి 15 మంది మాతల చేత వ్రతం చేయించారు. ప్రధానాచార్య పాలారం శ్రీలత మాట్లాడుతూ వరలక్ష్మి అమ్మవారు సంపద, సౌభాగ్యం, ఆరోగ్యం, ఆనందం ప్రసాదించే తల్లిగా భక్తితో ఆరాధించబడతారని తెలిపారు.శ్రావణ మాసంలో జరిగే ఈ వ్రతం భారతీయ సంస్కృతిలో విశిష్టమైన పండుగ అని, విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, ధర్మం, విలువలను పిల్లలకు అందించడం శిశు మందిర్ లక్ష్యమని పేర్కొన్నారు.కార్యదర్శి బబ్బుల రవీందర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొని వ్రతాన్ని విజయవంతం చేశారు.

## నూతన డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన బి. తిరుమల



**పెద్దపల్లి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి జిల్లా పౌర సంబంధాల అధికారిణిగా (డీపీఆర్వో) బి. తిరుమల నియమితుల య్యారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలసి ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం శాఖ అధికారులతో సమావేశమై మీడియా సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. జిల్లా పౌర సంబంధాల శాఖ పనితీరును మరింత బలోపేతం చేస్తానని బి. తిరుమల పేర్కొన్నారు.

## గొర్రెల పెంపకందారుల అభివృద్ధి లక్ష్యం బాషవేణి మల్లేశం యాదవ్



**హుస్నాబాద్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** చిగురుమామిడి మండలంలో జరిగిన సమావేశంలో కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా యూనియన్ చైర్మన్ బాషవేణి మల్లేశం యాదవ్ మాట్లాడుతూ యాదవ, కురుమ గొర్రెల కాపరుల కుటుంబాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. నూతన పాలకవర్గం ఏర్పాటైన అనంతరం మండలాల వారీగా పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటున్నామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంత్రులతో చర్చలు జరుపుతానని పేర్కొన్నారు. గతంలో గొర్రెలకు నట్టల నివారణ మందులు అందేలా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తుచేశారు.రానున్న రోజుల్లో జిల్లా సహకార సంఘాల ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ చిగుర్ల శ్రీనివాస్ కురుమ, డైరెక్టర్లు అగిత రవీందర్, కాల్వ సురేష్ యాదవ్, చౌటపల్లి రంజిత్ యాదవ్, జిల్లెల్ల పరశురాములు యాదవ్, దాడి ఆంజనేయులు యాదవ్, బండి మల్లయ్య యాదవ్, సందవేణి ప్రసాద్ యాదవ్, కత్తుల రమేష్ యాదవ్, మండల సహకార సంఘాల అధ్యక్షులు, గొల్లకురుమ యాదవ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అప్పు ఇవ్వలేదని మహిళను హత్య చేసి బంగారం దోచుకున్న కేసులో నిందితుడు తడగొండ దామోదర్ (34)కు జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్ శుక్రవారం తీర్పు ఇచ్చారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, రామడుగు మండలం తిరుమలాపూర్‌కు చెందిన దామోదర్ తన బంధువైన మామిడిపల్లి అనిత (55)ను డబ్బు కోసం వేధించాడు. ఆమె నిరాకరించడంతో 2023 మార్చి 23న స్నేహితుడు శివకుమార్‌తో కలిసి ఇంట్లో ఒంటరిగా ఉన్న అనితను గొంతు పిసికి చున్ని మెడకు చుట్టి హత్య చేసి బంగారం దోచుకెళ్లాడు.రామడుగు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. సాక్ష్యాలను పరిశీలించిన కోర్టు నిందితుడు దామోదర్‌పై నేరం నిరూపితమై జీవిత ఖైదు శిక్ష విధించింది.

## ఎస్టీపీ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్రవ్యాప్తంగా మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రాల (ఎస్టీపీ) నిర్వహణపై సీడీఎంఏ అధికారి శ్రీదేవి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొని స్థానిక ఎస్టీపీ పని తీరు, సమస్యలు, పునర్వినియోగం, వాటర్ ప్లస్ హోదా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడి) సిస్టమ్ వివరాలను అందించారు. ఎస్టీపీ పూర్తి స్థాయి వినియోగంలోకి రావడానికి సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.అమృత్ స్కీం నిధులతో పెండింగ్ యూజీడి పనులు త్వరలో పూర్తి చేస్తామని, వాటి ద్వారా ఎస్టీపీ సామర్థ్యం మరింత మెరుగవుతుందని కమిషనర్ పేర్కొన్నారు.సీడీఎంఏ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో మురుగునీటి రహిత వాతావరణం కల్పించేందుకు ఎస్టీపీలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు లచ్చిరెడ్డి, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలి




**- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిపారుదల ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని ఆదేశించారు.కరీంనగర్ కలెక్టరేట్ నుంచి సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్థానిక ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, ఇరిగేషన్ అధికారులు, భూసేకరణ విభాగం
అధికారులు పాల్గొన్నారు

## బోనాల పోస్టర్ ఆవిష్కరించిన గుర్రాల వెంకటేష్ యాదవ్



**బోడుప్పల్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బోడుప్పల్‌లో ఆదివారం నిర్వహించనున్న బోనాల పండుగను పురస్కరించుకుని బోనాల శుభాకాంక్షల పోస్టర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుర్రాల వెంకటేష్ యాదవ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోడుప్పల్ గ్రామ ప్రజలు ప్రతి సంవత్సరం అత్యంత భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా బోనాల పండుగను జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారికి బోనం సమర్పిస్తూ తమ భక్తిని చాటుకుంటారని తెలిపారు.

పండుగకు రెండు రోజుల ముందే గ్రామంలో ఉత్సవ వాతావరణం నెలకొనడం సంతోషకరమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలందరూ ఐకమత్యంతో నిర్వహించాలని ఆకాంక్షించారు.

శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నిండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని గుర్రాల వెంకటేష్ యాదవ్ తెలిపారు.

## కట్ట మైసమ్మ తల్లి వార్షికోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

**- ఈ నెల 23న ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు**
**- ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బోనాలు, అన్నప్రసాద వితరణ**
**భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి**



**ఆమనగల్లు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలంలోని సూరసముద్రం చెరువు కట్ట వద్ద కొలువుదీరిన శ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈ నెల 23న భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్, 14వ వార్డు కౌన్సిలర్ మొక్తల వెంకటయ్య ముదిరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సద్గురు శాంకరి అఘోరి మాత ఆశీస్సులతో నిర్వహిస్తున్న ఈ వార్షికోత్సవంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బోనాలు, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణతో పాటు అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే వేడుకల్లో 6 గంటలకు పంచామృతాభిషేకం, 7 గంటలకు ప్రత్యేక పూజలు, 7.30 గంటలకు కంకణధారణ, 8 గంటలకు గణపతి పూజ, 9 గంటలకు పూర్ణాహుతి, 10 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, 12.30 గంటలకు తీర్థప్రసాద వితరణ, 1 గంటకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు తెలిపారు. వార్షికోత్సవానికి ఆమనగల్లు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని వెంకటయ్య ముదిరాజ్ కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు
చేస్తున్నట్లు తెలిపారు

## పదవీ విరమణ పొందిన జీఎం నారాయణకు ఘన సన్మానం



**ఆమనగల్లు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సూర్యలక్ష్మి కాటన్ మిల్ ఆమనగల్లు జీఎం నారాయణ పదవీ విరమణ సందర్భంగా ఐఎన్‌టీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం నారాయణను శాలువా, పూలమాలలతో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. మిల్ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ఆయన అందించిన సేవలను నాయకులు కొనియాడారు. పదవీ కాలంలో కార్మికులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఐఎన్‌టీయూసీ నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో గోపాల్ నాయక్, శ్రీను, మల్లేష్, నిరంజన్, చందర్, కుమార్, కమ్లీ, లక్ష్మి, మంగమ్మ
తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గొట్టిముక్కల సురేష్ రెడ్డి జన్మదిన వేడుకలు



**పెద్దపల్లి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఎలిగేడు మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కల సురేష్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు గాదె రంజిత్ రెడ్డి, జిల్లా నాయకులు నారాయణస్వామి, వేణుగోపాల్ రెడ్డి, తిరుపతి, అంజయ్య, ఆసంపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.నాయకులు సురేష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

## 22/ఏ నిషేధిత జాబితా తొలగించాలని బీజేపీ వినతి



**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగరంలోని రేకుర్తి, విద్యానగర్‌తో పాటు జిల్లాలో పేద ప్రజల ఇళ్లను, స్థలాలను అన్యాయంగా 22/ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మేయర్ కొలగాని శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు కలిసి డిఆర్ఓ జె. స్వామిని కలసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ పేద ప్రజల నివాసాలను ముందస్తు సమాచారం లేకుండా నిషేధిత జాబితాలో చేర్చడం అన్యాయమని, వెంటనే తొలగించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలు త్వరగా పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పేద ప్రజలు దశాబ్దాలుగా కట్టుకున్న ఇళ్లను అధికారుల నిర్లక్ష్యం వల్ల నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల తీవ్ర ఇబ్బందులు
ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## వయోవృద్ధుల సంరక్షణపై అవగాహన సదస్సు




**మంథని, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా మంథని కోర్టు ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమ బాధ్యత వారసులదేనని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం రెవెన్యూ డివిజన్ అధికారులు కేసులను విచారించి ఉత్తర్వులు జారీ చేస్తారని, ఉల్లంఘన జరిగితే గరిష్ఠంగా మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.5 వేల వరకు జరిమానా విధించవచ్చని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు కె. రఘోత్తం రెడ్డి, సువర్ణ చంద్రశేఖర్ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు కటకం శ్రీనివాస్, సదన్ కుమార్, శశిభూషణ్ కాచె తదితరులు పాల్గొన్నారు.?

## వాలీబాల్ క్రీడాకారుడు మునీబ్‌కు ఘన సత్కారం



**సుల్తానాబాద్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబరిచి సిరిసిల్ల వాలీబాల్ అకాడమీలో శిక్షణ పొందేందుకు ఎంపికైన సుల్తానాబాద్ యువ క్రీడాకారుడు మునీబ్‌ను శుక్రవారం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షుడు, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రవీందర్ అధ్యక్షత వహించారు. మునీబ్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి అభినందించారు.ఈ సందర్భంగా ముత్యాల రవీందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, సరైన శిక్షణ, ప్రోత్సాహం అందితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని అన్నారు. మునీబ్ విజయాలు స్థానిక యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు గాజుల రాజమల్లు, అమిరిశెట్టి తిరుపతి, కుమార్ కిషోర్, వరప్రదీప్, గాదాసు రవి, కోచ్ గెల్లు మధుకర్ యాదవ్, మొబీన్, అజ్జు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

## శిశుమందిర్‌లో వైభవంగా వరలక్ష్మీ వ్రతం వేడుకలు



**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ సరస్వతీ శిశుమందిర్ హైస్కూల్‌లో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పాఠశాల ఆచార్యులు, మాతృమూర్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబాల సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం, పిల్లల విద్యాభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మహిళను మాతృశక్తిగా గౌరవించే సంప్రదాయం ఉందని, ఈ విలువలను బాల్యంలోనే పిల్లల్లో పెంపొందించడం అవసరమని తెలిపారు.ఆర్ఎస్ఎస్ జన్మశతాబ్ది స్ఫూర్తితో నిర్వహిస్తున్న సప్తశక్తి సంగమం కార్యక్రమాల ద్వారా నారీశక్తి గౌరవం, భారతీయ సంస్కృతి విలువలను బలంగా చాటుతున్నామని జిల్లా అధ్యక్షుడు బొడ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బొడ్ల గీతారాణి, అప్పిడి వకుళా దేవి, ఊత్కురు రజనీ శ్రీనివాస్, కార్యదర్శులు కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, గీకురు కృష్ణవేణి, ఆచార్యులు,
మాతాజీలు, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్



**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి పనులకు వేగం పెంచుతూ మేయర్ కొలగాని శ్రీనివాస్ శుక్రవారం 2వ, 12వ డివిజన్లలో శంకుస్థాపన చేశారు. 2వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 12వ డివిజన్ విఘ్నేశ్వర కాలనీలో యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు జరుగుతున్నాయని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఘనంగా తీజ్ ఉత్సవాలు



**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్, చింతకుంట ప్రాంతాల్లో బంజారా మహిళల ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలు వైభవంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని మహిళలకు శుభాకా ంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బంజారా సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, తీజ్ ఉత్సవాలు మహిళల్లో ఐక్యత, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.బంజారా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, కార్పొరేటర్లు మాసం గణేష్, ఏపీపీ చంద్ర, బండ రమణారెడ్డి, తోట అనిల్, గాజా రమా శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, కర్ర పద్మ అనిల్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, విప్పల సాయి జ్యోతి, గడ్డి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల హక్కులపై న్యాయ అవగాహన సదస్సు



**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని ప్రణామ్ సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్‌లో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, పెరుక రంగయ్య మాట్లాడుతూ వయోవృద్ధుల హక్కులకు చట్టాలే రక్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం--2007, నిబంధనలు--2011లోని ముఖ్యాంశాలను వివరించారు.వృద్ధుల సంరక్షణ, పోషణ బాధ్యత, నిర్లక్ష్యం లేదా వేధింపుల సందర్భాల్లో అందుబాటులో ఉన్న చట్టపరమైన పరిష్కారాలపై అవగాహన కల్పించారు. అర్హులైన వారికి ఉచిత న్యాయ సేవలు, సలహా, న్యాయవాది సహాయం అందుబాటులో ఉందని తెలిపారు.లోక్ అదాలత్, శాశ్వత లోక్ అదాలత్ ద్వారా వివాదాలను సత్వరంగా, స్నేహపూర్వకంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని వివరించారు. వయో వృద్ధులు తమ హక్కులను తెలుసుకుని, అవసరమైనప్పుడు చట్టాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సెంటర్ అధ్యక్షుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి, కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి, కోశాధికారి చింతల సత్యనారాయణ, లీగల్ ఎయిడ్ సభ్యులు ఎలుగు తన్మయి, యస్. భావన, విశ్రాంత రెవిన్యూ అధికారి ఈశ్వరయ్య, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా మహాశక్తి దేవాలయంలో వరలక్ష్మీ వ్రతం



**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** చైతన్యపురిలోని శ్రీ మహాశక్తి దేవాలయంలో వరలక్ష్మీ వ్రత వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం ప్రత్యేక అలంకరణలతో అమ్మవార్లకు మహా హారతి నిర్వహించారు. సాయంత్రం వరలక్ష్మీ వ్రతం, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులతో ఆలయ నిర్వాహకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం పూల అలంకరణలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దబడింది. అమ్మవారిని దర్శించుకుంటే సంపద, ఐశ్వర్యం, సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసంతో వేలాది మంది మహిళలు, భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. మహిళా భక్తుల సందడితో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన వెలిచాల



**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ తల్లి కర్ర లక్ష్మీబాయి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు శనిగరంలోని వారి నివాసానికి వెళ్లి రాజశేఖర్‌ను పరామర్శించారు. లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మార్కె ట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, అనంతుల రమేశ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## మానసిక వికలాంగుల పాఠశాలను సందర్శించిన శాతవాహన యూనివర్సిటీ వీసీ



**తిమ్మాపూర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలను శుక్రవారం శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ సందర్శించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డిని కలిసి పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సంరక్షణ, బోధన విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. మానసిక వికలాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, వృత్తి విద్యా శిక్షణ అందించడం అభినందనీయమని వీసీ పేర్కొన్నారు. పాఠశాల అధ్యాపకుల ఓపిక, అంకితభావాన్ని ప్రశంసిస్తూ, ట్రస్ట్ సభ్యుల కృషి సమాజానికి ఆదర్శమని అన్నారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి వీసీ ఉమేష్ కుమార్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ సతీష్, అడ్మినిస్ట్రేటర్ బాల్‌రాజ్, డైరెక్టర్ చాడ శ్రీధర్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సస్యరక్షణతో పంటలకు అధిక దిగుబడులు

**- జొన్న, వరి పంటలపై ఆత్మా క్షేత్ర ప్రదర్శనలు.. రైతులకు పోషక యాజమాన్యంపై అవగాహన**



**ఆమనగల్లు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జొన్న, వరి పంటల్లో సస్యరక్షణతో పాటు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆత్మా పథకంలో భాగంగా శుక్రవారం ఆమనగల్లు మండలంలోని రామ్‌నుంతల, పోలేపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో రైతుల పొలాల్లో జొన్న, వరి పంటలపై ప్రత్యేక క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సంరక్షణ, చీడపీడల నివారణ, సమతుల్య పోషకాల వినియోగం వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. పంటల్లో సరైన సమయంలో సస్య రక్షణ చర్యలు చేపట్టి, అవసరమైన పోషకాలను అందిస్తే దిగుబడులతో పాటు పంట నాణ్యత కూడా మెరుగుపడుతుందని శ్రీనివాస్ గౌడ్ వివరించారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా రైతులకు ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్, సూక్ష్మ పోషకాలు, మందు గుళికలను అందజేశారు. రైతులు ఆధునిక, శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించి పంటల సాగులో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు మీనాక్షి, ప్రభావతి, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



**- వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళా భక్తులు**

**ఆమనగల్లు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వరలక్ష్మీ వ్రత పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు, భజనలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, పూలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయబద్ధంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య రాష్ట నాయకులు రామ్మోహన్, రామన్న మిత్ర మండలి సభ్యులు శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఇంట వెలుగులు



**- మైసిగండి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం.. ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్**

**ఆమనగల్లు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కడ్తాల్ మండలం మైసిగండి గ్రామపంచాయతీ పరిధిలో ఇస్లావత్ సంధ్యా--రమేష్ నాయక్ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, ఉపసర్పంచ్ హీరా సింగ్ నాయక్‌తో కలిసి శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సీఎం సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని, రెండో దశలో ఇళ్లు లేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని వెల్లడించారు. ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జంగయ్య, వార్డు సభ్యులు జాటోవత్ బాబూలాల్, జరుపుల బన్సీ నాయక్, వినోద్ నాయక్, చందన్ నాయక్, మాజీ సర్పంచ్ శేఖర్ గౌడ్, రవి, రాజు, గ్రామ పెద్దలు స్టాలిన్, కిషన్ నాయక్, తులసీరామ్, మోతీ నాయక్, సుబ్బా, సాయికుమార్, శంకర్, అమర్‌సింగ్, మల్లేష్, కృష్ణ, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు అవార్డు.. తహసీల్దార్‌కు ఘన సన్మానం

**ఆమనగల్లు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు అవార్డు అందుకున్న వెల్దండ మండల తహసీల్దార్ కార్తీక్ కుమార్‌ను ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము ఘనంగా సన్మానించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్తీక్ కుమార్‌కు శాలువా కప్పి, పూలమాల వేసి అభినందనలు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందించడంతో పాటు మండల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న తహసీల్దార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్తీక్ కుమార్ మాట్లాడుతూ తనకు లభించిన అవార్డు తన ఒక్కరి కృషి ఫలితం కాదని, కార్యాలయ సిబ్బంది సమష్టి కృషి, సహకారంతోనే సాధ్యమైందని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మరింత చొరవ చూపుతూ, భవిష్యత్తులోనూ మెరుగైన



సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రామన్న మిత్ర మండలి సభ్యులు శ్రీ ను నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎల్పీజీ వినియోగదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి




**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ఫర్ ఎల్పీజీ (డిబిటిఎల్) మరియు ప్రధాన మంత్రి ఉజ్జ్వల యోజన (పిఎంయువై) పథకాల పరిధిలోకి వచ్చే అన్ని గృహ వినియోగదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ అన్ని ఆయిల్ మార్కె టింగ్ కంపెనీలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. వినియోగదారులు సంబంధిత గ్యాస్ ఏజెన్సీ, గ్యాస్ డెలివరీ బాయ్స్ లేదా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మొబైల్ యాప్‌ల ద్వారా ఉచితంగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల కార్యాలయం విజ్ఞప్తి చేసింది.

## పంట నష్టపోయిన రైతుకు ప్రభుత్వం ఆదుకోవాలి



**నందికొట్కూరు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు లేకపోవడంతో నందికొట్కూరు రైతు ఆంద్రెడ్డి వెంకటరెడ్డి సాగు చేసిన తొమ్మిది ఎకరాల మినుము పంట పూర్తిగా దెబ్బతింది.సొంతంగా మూడు ఎకరాలు, కౌలు మీద ఆరు ఎకరాలు తీసుకుని సాగు చేసిన ఆయన ఎకరాకు రూ.26 వేల పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. పంట విఫలమవడంతో తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే పంట నష్టాన్ని పరిశీలించి, ప్రభుత్వం నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఆర్థిక సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.స్థానికులు పలువురు రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.

# యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి - జి. సుభద్రమ్మ



**పాములపాడు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పాములపాడు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించనున్నట్లు ఏఈఆర్‌ఓ/తహసిల్దార్ జి. సుభద్రమ్మ తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓ) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఫారం--6 ద్వారా కొత్తగా ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చని, ఫారం--7 ద్వారా అభ్యంతరాలు, ఫారం--8 ద్వారా సవరణలు చేసుకోవచ్చని వివరించారు. ప్రత్యేకంగా 18--19 సంవత్సరాల వయస్సు కలిగిన యువ ఓటర్లు తమ పేర్లను తప్పనిసరిగా ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని తహసిల్దార్ సూచించారు.

## ఘనంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు



**వెలుగోడు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం నియోజకవర్గ మెగా యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో వెలుగోడు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పేషెంట్లకు పళ్ళు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెగా యూత్ ఫోర్స్ కన్వీనర్ మారెడ్డి రామయ్య, స్పోక్ పర్సన్ పసుపుల రాజేష్ యాదవ్, సి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్ సులోచన, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.అలాగే జనసేన పార్టీ సీనియర్ నాయకులు మస్తాన్ వలి, వీర మహిళలు సుకన్య, ప్రవల్లిక, మహాలక్ష్మి, సరస్వతి, రామారావు, దీపక్, ఈశ్వర్ తదితరులు హాజరై సేవా కార్యక్రమంలో భాగమయ్యారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి



**నందికొట్కూరు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో జ్ఞానసూర్యుడు మనుమని జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జ్ఞానసూర్యుడు మనవడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు.

# మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి



**నందికొట్కూరు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నందికొట్కూరు మండలం కొనేటమ్మపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దామోదర్ రెడ్డి వైరల్ ఫీవర్‌తో కర్నూల్‌లోని రామాంజనేయ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి హాస్పిటల్‌కు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పరామర్శించారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అమరాబాద్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం రేపు అమరాబాద్ మండల కేంద్రంలో జరగనుంది. ఈ నెల 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రేపు శనివారం ఉదయం 10 గంటలకు ఎం.కె. గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు కార్డులు అందజేయనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ హాజరుకానున్నారు. మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కోరింది.

# రూపారెడ్డి హత్యపై ఆగ్రహ జ్వాల

**– ఆమనగల్లులో వందలాది ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలతో భారీ నిరసన ర్యాలీ**



**ఆమనగల్లు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లాకు చెందిన పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి రూపారెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ టీఆర్ఎస్ఎంఏ ఆమనగల్లు డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆమనగల్లు డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్బిమల్ల శ్రీరాం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడుగుల, వెల్దండ మండలాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు వందల సంఖ్యలో తరలి వచ్చారు. ముందుగా రూపారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం పట్టణంలోని జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు. విద్యారంగంలో పనిచేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై జరుగుతున్న బెదిరింపులు, భౌతిక దాడులు, వేధింపులను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక పోలీస్ నోడల్ అధికారి వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యారంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి ప్రాణ భద్రతకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా టీఆర్ఎస్ఎంఏ ప్రతినిధులు అల్లాజి గౌడ్, అవ్వారి శివలింగం, అవ్వారి నిరంజన్, గోలి శ్రీనివాసులు, కోట్ల వెంకటేష్, చంటి, కమటం శేఖర్, యూ. శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణస్వామి, ఆంజనేయులు, జంగయ్య గౌడ్, రామస్వామి గౌడ్, తిరుమలేష్, శ్రీశైలం, రమేష్, విఠల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి మందిరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

**– శ్రావణ శుక్రవారం సందర్భంగా 50కిపైగా వ్రతాలు.. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**



**ఆమనగల్లు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రావణమాసంలోని పవిత్రమైన శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆమనగల్లు శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సత్యసాయి మందిరంలో సామూహిక శ్రీ వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ సత్యసాయి బాబా దివ్య అనుగ్రహ ఆశీస్సులతో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని ప్రత్యేకంగా పూజించారు. ఈ సందర్భంగా సత్యసాయి మందిరాన్ని సుందరంగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య సుమారు 50కిపైగా శ్రీ వరలక్ష్మీ వ్రతాలను సామూహికంగా నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. కుటుంబ సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం, సౌభాగ్యం కోసం సుమంగళి మహిళలు భక్తిశ్రద్ధలతో వ్రతాలను ఆచరించారు. వ్రత కార్యక్రమం అనంతరం నారాయణ సేవ నిర్వహించి భక్తులు, పట్టణ ప్రజలకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబా బోధించిన "ప్రేమించు -- సేవచేయు" అనే సందేశానికి అనుగుణంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. సమాజంలో ప్రేమ, ఐక్యత, మానవత్వం, సేవాభావాన్ని పెంపొందించడమే సమితి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దొంతు శ్రీనివాస్, డాక్టర్ దొంతు పుల్లయ్య, గోల్డ్ రాము, గోల్డ్ బ్రహ్మం, నాగిళ్ల లింగం, ఎన్.ఆర్. ప్రభాకర్, రామాచారి, అప్పం తిరుపతయ్య, ఆర్టీఏ శేఖర్, శంకర్, అల్లాజి, పోలిశెట్టి శ్రీనివాస్, ఉప్పు శ్రీశైలం, పోలిశెట్టి నందు, గందె శేఖర్, ఆలేటి నారాయణ, కృష్ణారెడ్డి, గాజుల శ్రీనివాస్, గంజి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. మహిళా భక్తులు దొంతు విజయలక్ష్మి, దొంతు సంధ్య, అప్పం అలివేలమ్మ, బొంతు కృష్ణవేణి, శైలజ, అశ్విని, గందె కృష్ణవేణి, పోలిశెట్టి సింధు, పోలిశెట్టి ధనలక్ష్మి తదితరులతో పాటు సత్యసాయి భక్తులు, స్థానిక మహిళలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా జీఎం నారాయణ సేవలు

**– పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం.. సేవలు అభినందనీయమన్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి**



**ఆమనగల్లు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కార్మికుల శ్రేయస్సు, సంక్షేమం కోసం ఆమనగల్లు కాటన్ మిల్లు జనరల్ మేనేజర్ నారాయణ చేసిన సేవలు అభినందనీయమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, మిల్లు బీఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు ఆచారి అన్నారు. శుక్రవారం ఆమనగల్లు కాటన్ మిల్లులో జీఎం నారాయణ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తన పదవీకాలంలో కార్మికుల సంక్షేమానికి నారాయణ విశేష కృషి చేశారని కొనియాడారు. మిల్లు అభివృద్ధితో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీఎం నారాయణ దంపతులను ఘనంగా సన్మానించి శాలువాలు కప్పి అభినందించారు. నారాయణ పదవీ విరమణ అనంతరం కూడా ఆయన సేవలు, అనుభవం మిల్లు కార్మికులకు ఆదర్శంగా నిలుస్తాయని ఆచారి అన్నారు. సహచర ఉద్యోగులు జీఎం నారాయణకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలు, ఆనందాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సాయిబాబా, మేనేజర్లు రఘుపతిరావు, బ్రహ్మయ్య, వేణుగోపాల్, నరసింహారావు, అశోక్‌కుమార్, శ్రీనివాసరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్క నాయక్, నాయకులు శంకర్‌రావు, మాలిక్, విజయ తదితరులు పాల్గొన్నారు.

# అమ్రాబాద్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు

**– ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ**



**అమ్రాబాద్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం అమ్రాబాద్ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు అచ్చంపేట తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల రాజగోపాల్ తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన నేపథ్యంలో, అమ్రాబాద్ మండల కేంద్రంలోని ఎం.కె. గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆగస్టు 22న ఉదయం 10 గంటలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, జిల్లా డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మహిళా నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చింతల రాజగోపాల్ కోరారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**తెలకపల్లి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని, అర్హత కలిగిన ప్రతి వ్యక్తి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పారదర్శకంగా, వేగవంతంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి మండల కేంద్రంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. మండలంలోని 197, 201 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2002 నాటి ఓటరు జాబితాను ప్రస్తుత ఓటరు జాబితాతో అనుసంధానం చేసే క్రమంలో గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు.
197వ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటరు ఎం.డి. అక్బర్కు నోటీసు జారీ చేసిన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, 2002 నాటి ఓటరు జాబితాలో ఉన్న పేరు, ప్రస్తుతం నమోదైన పేరులో వ్యత్యాసం ఉండటంతో అనామలీస్ జాబితాలో చేర్చి నోటీసు జారీ చేసినట్లు అధికారులు వివరించారు.
నోటీసుల జారీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నోటీసు సంబంధిత ఓటరుకు చేరేలా చర్యలు చేపట్టాలని, తమ అర్హతను నిరూపించుకునేందుకు అవసరమైన అవకాశాన్ని కల్పించాలని అధికారులకు సూచించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 11 రకాల ధ్రువపత్రాలలో తమకు వర్తించే ఆధారాలను బీఎల్‌వోలకు సమర్పించాలని కోరారు. ఓటర్లు సమర్పించిన పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత నిర్ధారణ అనంతరం వివరాలను భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఓటర్ల నుంచి అందిన ధ్రువపత్రాల పరిశీలన, ఆన్‌లైన్ నమోదు తదితర ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం లేకుండా




అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద నమోదులను మాత్రం ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పరిశీలించాలని స్పష్టం చేశారు.
తెలకపల్లి మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో 2002 ఓటరు జాబితా ఆధారంగా 582 మంది మ్యాపింగ్ కాని ఓటర్లు, 6,974 మంది అనామలీస్ జాబితాలో ఉన్నట్లు గుర్తించామని, మొత్తం 7,556 నోటీసులు రూపొందించి పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు.
ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్‌వోలు, బీఎల్ఏలు, రెవెన్యూ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్లకు ఎస్ఐఆర్‌పై పూర్తి అవగాహన కల్పించి, నోటీసులు అందుకున్న వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించాలని సూచించారు. పర్యటనలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ హత్యపై విద్యాసంస్థల యాజమాన్యాల నిరసన



**మానకొండూరు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ మానకొండూరు మండలంలోని పలు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు రస్మా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూపారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, యాజమాన్యాలు కలిసి ఎమ్మార్వో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు. హత్యకు కారణమైన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల సిబ్బందికి ప్రభుత్వం తగిన భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థల్లో ప్రశాంత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. రూపారెడ్డి కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు.

## ఫీడర్ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత


**కరీంనగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఫీడర్ పనుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. శివనగర్ ఫీడర్ పరిధిలో కొత్త లైన్, కొత్త డిటీఆర్ పనుల నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది. ప్రభావిత ప్రాంతాలు: సప్తగిరి కాలనీ, శివనగర్, ప్రగతి నగర్, బతుకమ్మ కాలనీ, మార్కండేయ నగర్. అలాగే సిసి ఫీడర్--ఆటో నగర్ ఫీడర్ మధ్య ఇంటర్‌లింక్ లైన్ పనుల కారణంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ప్రభావిత ప్రాంతాలు: ఈపీఎఫ్ కార్యాలయం, ఎల్ఐసి కార్యాలయం, స్టేడియం, భగత్‌నగర్, గౌతమినగర్. విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏడీఈ ఎం. లావణ్య కోరారు.

## వనమహోత్సవంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ



**పెద్దపల్లి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిమ్మనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేల్పుల రమేష్ మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి అట్ల రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ అట్ల కుమార్, వార్డ్ మెంబర్ కాంపెల్లి నంబయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ముక్కర లావణ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అదుపు తప్పి ట్రాక్టర్ బావిలో పడి డ్రైవర్ మృతి



**ఖానాపూర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఖానాపూర్ మండలంలోని బావాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగిన దుర్ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మామిడిపల్లి గంగాధర్ (43) మృతి చెందాడు. వ్యవసాయ పొలంలో కేజీ విల్ వాహనాన్ని నడుపుతూ ప్రమాదవశాత్తు అదుపు తప్పి ట్రాక్టర్ బావిలో పడింది. నీట మునిగిన గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం యూసుఫ్ నగర్‌కు చెందిన గంగాధర్‌కు ఇద్దరు భార్యలు, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెంబి ఎస్సై హనుమండ్లు తెలిపారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన జాన్సన్ నాయక్



**ఖానాపూర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** దస్తురాబాద్ మండలం రేవోజీపేట గ్రామానికి చెందిన కోయిడి లక్ష్మీ ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మీ గారి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతంపై నాయకులు, కార్యకర్తలతో చర్చ



**ఖానాపూర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ గురువారం, శుక్రవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఖానాపూర్, కడెం, జన్నారం, ఉట్నూర్ మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసి వారి బాగోగులు తెలుసుకున్నారు. క్యాంప్ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించి పార్టీ అభివృద్ధి అంశాలపై చర్చించారు. అనంతరం స్థానిక గ్రామాల్లో పెళ్లి కార్యక్రమాల్లో పాల్గొని ఆశీర్వాదాలు అందజేశారు. పార్టీకి చెందిన మరణించిన కుటుంబాలను పరామర్శించి, పేదవారికి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రతి కార్యకర్తకు ఎలాంటి సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇస్తూ, ధైర్యం నింపి ఉత్తేజపరిచారు. ఈ పర్యటనలో మాజీ ఎంపీటీసీ శ్రావణ్ శనిగారపు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాగునీటి విడుదలలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది: జగదీశ్ రెడ్డి




**నల్లగొండ, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో తగిన నీటి నిల్వలు ఉన్నప్పటికీ నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు సాగునీరు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఆరోపించారు.
శుక్రవారం నల్లగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సాగునీటి విడుదల విషయంలో ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను విస్మరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర మంత్రులు తమ పదవులను కాపాడుకునేందుకే పరిమితమై, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు.
ఆంధ్రప్రదేశ్‌కు నీటి తరలింపును అడ్డుకోవాల్సిన ప్రభుత్వం, అందుకు అనుమతులు ఇస్తూ తెలంగాణ రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. ఎడమ కాల్వ ఆయకట్టు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
నల్గొండ జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా తమ పదవులను కాపాడుకునేందుకే ముఖ్యమంత్రి వద్ద మోకరిల్లుతున్నారని జగదీశ్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు.
రైతుల ఆందోళనలను ప్రభుత్వం వెంటనే గుర్తించి సాగునీటి విడుదలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.
ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నిలబోతు భాస్కర్ రావు, పార్టీ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## షావుకారి జానకి మృతి సినీ పరిశ్రమకు తీరని లోటు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**నల్లగొండ, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతీయ చలనచిత్ర రంగంలో తనదైన నటనతో చిరస్థాయిగా గుర్తింపు పొందిన ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారి జానకి మృతి పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో వందలాది చిత్రాల్లో నటించి షావుకారి జానకి కోట్లాది మంది ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారని పేర్కొన్నారు. సహజసిద్ధమైన నటనతో కథానాయికగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఎన్నో విభిన్న పాత్రలకు ప్రాణం పోసి భారతీయ సినీ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. 'షావుకారి' చిత్రంతో ప్రారంభమైన ఆమె నట ప్రస్థానం భారతీయ సినిమా చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. ఆమె పోషించిన పాత్రలు నేటికీ ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని అన్నారు. షావుకారి జానకి మరణం తెలుగు చలనచిత్ర పరిశ్రమకే కాకుండా భారతీయ సినీ రంగం మొత్తానికి తీరని లోటని మంత్రి అభిప్రాయపడ్డారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## నల్లగొండ పోలీసులకు ఉపాధ్యాయులు, విద్యార్థుల కృతజ్ఞతలు



**నల్లగొండ, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి రూపారెడ్డి దారుణ హత్య ఘటనపై జిల్లావ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో, కేసును ఛేదించిన నల్లగొండ జిల్లా పోలీసులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు కృతజ్ఞతలు తెలిపారు. రూపారెడ్డి హత్యకు నిరసనగా ట్రస్మా జిల్లా కమిటీ పిలుపు మేరకు నల్గొండ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు శుక్రవారం బంద్ పాటించాయి. ఇదే సమయంలో కేసును వేగంగా ఛేదించిన పోలీసుల పనితీరుపై ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రశంసలు కురిపించారు.
జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ నాయకత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం రాత్రింబవళ్లు శ్రమించి, ప్రతి ఆధారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిందితులను గుర్తించి కేసును కొలిక్కి తీసుకురావడాన్ని కొనియాడారు. ఘటనతో భయాందోళనలకు గురైన తమకు పోలీసుల విచారణ ధైర్యం, భరోసా కల్పించిందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.
కేసు ఛేదన కోసం అహర్నిశలు కృషి చేసిన పోలీసు అధికారులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. "పోలీసుల కృషిని జీవితాంతం మర్చిపోలేం" అంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు భావోద్వేగంతో స్పందించారు.
నల్లగొండ జిల్లా పోలీసుల అంకితభావం, సమర్థవంతమైన సమన్వయం, సాంకేతిక ఆధారాల పరిశీలన వల్లే కేసు త్వరితగతిన ఛేదించగలిగారని ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.
ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేసి, త్వరలోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేసి నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు చేపడతామని తెలిపారు.

## ప్రీ-ప్రైమరీ తరగతులకు ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలను నియమించాలి

**– డీఈవో కార్యాలయం ఎదుట టీఎస్‌యూటీఎఫ్ నేతల నిరసన**




**నల్లగొండ, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రీ-ప్రైమరీ తరగతులకు ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలను వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించినప్పటికీ ఆశించిన స్థాయిలో మౌలిక వసతులు, అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాలేదని ఆరోపించారు. దీంతో విద్యార్థుల బోధన, సంరక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలంటే ప్రతి పాఠశాలలో అవసరమైన ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీలను భర్తీ చేసి ప్రీ-ప్రైమరీ విద్యను బలోపేతం చేసే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేశారు.

## పేదల పాలిట వరం.. సేవలకు చిరునామా 'వాక్ ఫౌండేషన్'

**– విద్యార్థులకు అండగా.. ఆపదలో ఉన్న కుటుంబాలకు భరోసాగా**
**మానవత్వాన్ని చాటుతున్న డాక్టర్ వన్నాల వెంకటరమణ సేవా కార్యక్రమాలు**



**వరంగల్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుపేదలకు చేయూతనందించడం, విద్యార్థుల చదువుకు అండగా నిలవడం, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం లక్ష్యంగా వాక్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసలు అందుకుంటున్నాయి. ప్రముఖ సామాజికవేత్త, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమాలు అనేక పేద కుటుంబాల జీవితాల్లో ఆశాకిరణాలుగా నిలుస్తున్నాయి."సాయం చిన్నదైనా.. ఒక కుటుంబానికి అది గొప్ప భరోసా" అనే భావనతో వాక్ ఫౌండేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించడం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం చేయడం వరకు పలు కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోంది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వరంగల్ తూర్పు నియోజకవర్గం 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త గాజర్ల విజయ్ కుటుంబాన్ని డాక్టర్ వన్నాల వెంకటరమణ పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. విజయ్ కుమార్తె గాజర్ల దేవన్ను విద్యాభ్యాసానికి ఆటంకం కలగకుండా వాక్ ఫౌండేషన్ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా వరంగల్ కరీమాబాద్ 39వ డివిజన్‌కు చెందిన వరంగల్ వారియర్ క్రికెటర్ విశ్వనాథ్ వైష్ణవ్ రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలుసుకుని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వాక్ ఫౌండేషన్ ద్వారా రూ.8 వేల ఆర్థిక సాయం అందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, పేద కుటుంబాల సంక్షేమం కోసం, ఆరోగ్య సేవల విస్తరణ కోసం డాక్టర్ వన్నాల వెంకటరమణ చేస్తున్న సేవలను పలువురు అభినందిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడం ఆయన సేవా దృక్పథానికి నిదర్శనమని పేర్కొంటున్నారు.వాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో ప్రతినెలా బియ్యం పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ, పేద విద్యార్థుల స్కూల్ ఫీజుల కోసం ఆర్థిక సహాయం వంటి అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.
విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం.. పేదలకు అండదండలు.. ఆపదలో ఉన్న వారికి ఆర్థిక భరోసా అనే లక్ష్యంతో కొనసాగుతున్న వాక్ ఫౌండేషన్ సేవలు సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నాయి.

## ధూళికట్టలో స్వచ్ఛ శుక్రవారం నిర్వహణ

**– పరిశుభ్రతపై అవగాహన.. సీజనల్ వ్యాధుల నివారణకు సూచనలు**



**ఎలిగేడు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ధూళికట్ట గ్రామంలో శుక్రవారం స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నివారణకు వ్యక్తిగత, పర్యావరణ పరిశుభ్రత ఎంతో అవసరమని వివరించారు.
ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో మాత్రమే వేయాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి అజ్మీర జ్యోతి, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.?

## ఓరుగల్లు జానపదాల స్వరాల ఝల్లు

**– హనుమకొండలో రెండు రోజుల పాటు జానపద కళల సందడి**
**– కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఈగ మల్లేశం పిలుపు**



**హనుమకొండ, ఆగస్టు 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఓరుగల్లు కళా కీర్తికి మరో వేదిక సిద్ధమైందని,కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఈగ మల్లేశం పిలుపునిచ్చారు.
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ (వరంగల్) ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో "ఓరుగల్లు జానపదాల స్వరాల ఝల్లు--కాకతీయ సకల కళల జాతర ఉత్సవాలు--2026" ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు తెలుగు ఉభయ రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు, విశిష్ట కళా సేవ రత్న పురస్కార గ్రహీత, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.
ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ఈగ మల్లేశం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించడంతో పాటు ఓరుగల్లు సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఇటువంటి ఉత్సవాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.ప్రజలు, కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని, ఓరుగల్లు కళా--సాంస్కృతిక ఘనకీర్తిని మరింతగా చాటిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎలిగేడు మండలంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు



**ఎలిగేడు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఎలిగేడు మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు. దీర్ఘసుమంగళిగా ఉండే వరం ప్రసాదించాలని అమ్మవారిని వేడుకుంటూ వ్రతాన్ని ఆచరించారు. పూజా కార్యక్రమాల అనంతరం ముత్తైదువులను ఆహ్వానించి పసుపు, కుంకుమ, వాయినాలను ఇచ్చిపుచ్చుకుంటూ సంప్రదాయాలను పాటించారు. "ఇస్తినమ్మా వాయినం... పుచ్చుకుంటినమ్మా వాయినం" అంటూ మహిళలు పరస్పరం వాయినాలు మార్చుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని దేవాలయాలు, ఇళ్ల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, పెద్ద సంఖ్యలో మహిళలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## వీధి దీపాలు వెలగక ప్రజల అవస్థలు

**– వెంటనే సమస్య పరిష్కరించాలి: బీజేపీ ఫ్లోర్ లీడర్ బోడ నరసింహ**





**కల్వకుర్తి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీలో ఇటీవల ప్రారంభించిన వీధి దీపాలు పది రోజులు గడవకముందే పనిచేయడం నిలిచిపోవడంతో పట్టణంలోని అనేక కాలనీలు అంధకారంలోకి వెళ్లాయని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బోడ నరసింహ విమర్శించారు.
ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను పలుమార్లు మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి పట్టణంలోని అన్ని కాలనీలు, ప్రధాన వీధుల్లో వీధి దీపాలను మరమ్మతు చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు రామకృష్ణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలపై సమీక్ష సమావేశం



**నంద్యాల, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల సబ్--డివిజన్ పరిధిలోని లైసెన్సు కలిగిన బార్లు, బార్ రెస్టారెంట్లు, రిటైల్ వైన్ షాపులు, ఐఎంఎఫ్ఎల్ అవుట్‌లెట్ల యజమానులు, ఇన్‌చార్జ్‌లతో శాంతి భద్రతల పరిరక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం శుక్రవారం 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ ఆధ్వర్యంలో జరిగింది. ప్రజా శాంతి, భద్రత కోసం సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.

## విద్యుత్ ఘాతంతో ఆవు మృతి



**ఎలిగేడు, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యుత్ ఘాతానికి గురై ఆవు మృతి చెందిన ఘటన ఎలిగేడు మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం, ఎలిగేడుకు చెందిన దాసరి రాజయ్యకు చెందిన ఆవు మేత మేస్తూ గ్రామంలోని 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు మృతితో తనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తనకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ ఏఈ సంపత్ కుమార్ను వివరణ కోరగా, విద్యుత్ షాక్ కారణంగానే ఆవు మృతి చెందిన విషయం వాస్తవమేనని తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను
నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

# తొలిరోజు ప్రశాతంగా సివిల్స్ మెయిన్స్..

**- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





**విజయవాడ, ఆగస్టు 21, 2026**
యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు శుక్రవారం విజయవాడ కేంద్రంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్నిజిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తనిఖీ చేశారు. తొలిరోజు పేపర్–1 ఎస్సే పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లను కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ, 22వ తేదీ, 23వ తేదీ, 29వ తేదీ, 30వ తేదీల్లో అయిదు రోజులు పాటు పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. తొలిరోజు మాత్రం ఉదయం సెషన్‌లో మాత్రమే పరీక్ష ఉందని.. మిగిలిన రోజుల్లో ఉదయం, మధ్యాహ్నం కూడా పరీక్షలు జరుగుతాయన్నారు. విజయవాడలోని పరీక్షా కేంద్రంలో 124 మంది అభ్యర్థులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నామన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక ప్రజా రవాణా సదుపాయాలను కల్పించామని.. భద్రత పరంగా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు 91549 70454 నంబర్‌తో కంట్రోల్ రూమ్ కూడా సేవలందిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పరీక్షల తొలిరోజు శుక్రవారం పేపర్ – 1 (ఎస్సే)కు 120 మంది అభ్యర్థులు హాజరుకాగా నలుగురు గైర్హాజరయ్యారు

# రోడ్డు భద్రతలో ఆదర్శ పట్టణంగా విజయవాడను నిలబెడదాం

**- ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్టుతో లక్ష్యాలను చేరుకుందాం**
**- ప్రమాద మరణాలు, క్షతగాత్రులను 10--15 శాతం తగ్గించడమే లక్ష్యంగా చర్యలు**
**-నాలుగు కీలక అంశాలతో సమగ్ర రోడ్డు భద్రత కార్యాచరణ**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**





**విజయవాడ, ఆగస్టు 21, 2026**
రోడ్డు భద్రతలో విజయవాడను ఆదర్శ పట్టణంగా ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని.. అదేవిధంగా లక్ష్యాల సాధనకు ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ కార్యక్రమం దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.విజయవాడను రోడ్డు భద్రతలో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఐడియల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్టుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆవిష్కరించారు.హోండా ఇండియా ఫౌండేషన్ సీఎస్ఆర్ భాగస్వామిగా, ట్రాక్స్ -- రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో అమలు సంస్థగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. రవాణా, పోలీస్ శాఖల సహకారంతో కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే మరణాలు, క్షతగాత్రులను 10--15 శాతం మేర తగ్గించడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడం ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమన్నారు. ఈ ప్రాజెక్టును ప్రధానంగా ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎడ్యుకేషన్, ఎమర్జెన్సీ కేర్ అనే నాలుగు అంశాల ఆధారంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా బ్లాక్‌స్పాట్‌లలో మౌలిక వసతుల లోపాలను గుర్తించి సరిచేయడం, జీరో టాలరెన్స్ జోన్ల ద్వారా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం, 105 పాఠశాలలు, 14 కళాశాలల్లో సుమారు 70 వేల మంది విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం, హెల్మెట్, సీటుబెల్ట్, లేన్ క్రమశిక్షణ, పాదచారుల భద్రతపై ప్రచారం నిర్వహించడం, అలాగే ప్రమాదాల సమయంలో సకాలంలో ప్రాథమిక సహాయం అందించేందుకు ఫస్ట్ రెస్పాండర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వ శాఖలు, పోలీస్, ప్రైవేటు సంస్థలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర భాగస్వామ్య సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమన్వయంతో పనిచేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో హోండా ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులతో పాటు విజయవాడ--ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, ట్రాక్స్ -- రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో (ఢిల్లీ) జనరల్ సెక్రటరీ రజనీ గాంధీ, రీజినల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం. వాసు తదితరులు పాల్గొన్నారు.

# యువతలో పారిశ్రామిక ఆలోచనలకు బాటలు

**ఆర్‌టీఐహెచ్‌లో ఐదు రోజుల శిక్షణా శిబిరం ముగింపు**





**విజయవాడ, ఆగస్టు 21, 2026**
రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్), విజయవాడ--ఎనికేపాడు ఆధ్వర్యంలో ఆగస్టు 17 నుంచి 21 వరకు నిర్వహించిన ఐదు రోజుల పారిశ్రామికవేత్తల శిక్షణా శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ శిక్షణా శిబిరంలో పీబీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులతో పాటు సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పారిశ్రామిక ఆలోచనా విధానం, సమస్యలను గుర్తించడం, వినూత్న పరిష్కారాలను రూపొందించడం, వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై వారికి అవగాహన, శిక్షణ అందించారు.కార్యక్రమంలో భాగంగా 21 వినూత్న వ్యాపార ఆలోచనలను విద్యార్థులు నిపుణుల ముందు ప్రదర్శించారు. పౌర సేవలు, ప్రజా రవాణా, ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు, వ్యవసాయం తదితర రంగాలకు సంబంధించిన ఆలోచనలను విద్యార్థులు వివరించారు. నిపుణులు విద్యార్థులకు విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు.ఈ సందర్భంగా ఆర్‌టీఐహెచ్ విజయవాడ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లిడా. హరి బాబులి మాట్లాడుతూ యువతలో సృజనాత్మక ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఆర్‌టీఐహెచ్ అందిస్తున్న అవకాశాలను వివరించారు. వినూత్న ఆలోచనలను ఆచరణలోకి తీసుకువచ్చి భవిష్యత్‌లో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.ఐదు రోజుల శిక్షణా శిబిరం విద్యార్థులకు ఆవిష్కరణలు, పారిశ్రామిక ఆలోచనలు, శిక్షణ, మార్గదర్శకత్వానికి మంచి వేదికగా నిలిచింది. కార్యక్రమం విజయవంతం కావడంలో ఆర్‌టీఐహెచ్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

## ఘనంగా రేణిగుంట్ల గణేశ్ గుప్తా జన్మదిన వేడుకలు



**షాద్‌నగర్, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి, ప్రజాసేవలో విశేష గుర్తింపు పొందిన ప్రముఖ సామాజిక నాయకుడు రేణిగుంట్ల గణేశ్ గుప్తా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, సామాజికవేత్తలు, స్నేహితులు, అభిమానులు ఆయనను కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సేవ, సేవా కార్యక్రమాలు, సంఘ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న గణేశ్ గుప్తా మరింత ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పలువురు ఆకాంక్షించారు. సమాజానికి ఆయన అందిస్తున్న సేవలు మరింత విస్తరించి, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గందీ సురేష్, ప్రముఖ సామాజిక కార్యకర్త నీల రవీందర్, ఫరూఖ్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు హనుమరి మురళీధర్, రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్ మలిపెద్ది శ్రీనివాస్, గజవాడ యశ్వంత్, గడ్డం ఆంజనేయులు తదితరులు పాల్గొని గణేశ్ గుప్తాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## శోభాయమానంగా వరలక్ష్మీ వ్రతాలు?



**కల్వకుర్తి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో రెండవ శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలు శోభాయమానంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణానికి చెందిన మహిళలు ఎన్నడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో వ్రతాలు ఆచరించారు. వరలక్ష్మీ వ్రతాలు పూర్తి చేసిన అనంతరం ముత్తయిదువులు ఒకరికొకరు పసుపు, కుంకుమ పంచుకుని సర్వమంగళ కటాక్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రతి శుక్రవారం నిర్వహించే లలితా సహస్రనామ పారాయణం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి పారాయణంలో పాల్గొన్న భక్తుల కోసం లక్కీ డ్రా నిర్వహించి, గెలుపొందిన మహిళకు చీరను బహుమానంగా అందజేశారు. అనంతరం ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ జూలూరి రమేష్ బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి లక్ష్మీనారాయణ, మహిళా అధ్యక్షురాలు మౌనిక, వాసవి క్లబ్ మహిళా అధ్యక్షురాలు బాదం సాయిలక్ష్మి, పాపిశెట్టి రాజేశ్వరి, దాచేపల్లి రోజారమణి, పోల లావణ్య, మారం సునీతతో
పాటు అధిక సంఖ్యలో పట్టణ మహిళలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుడి కుటుంబానికి అండగా మాజీ సర్పంచ్



**కల్వకుర్తి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణానికి చెందిన మున్సిపల్ కార్మికుడు రవి తల్లి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.
ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. కుటుంబానికి అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రేణుక రాజశేఖర్, చిగుళ్లపల్లి సతీష్, రమాకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, దున్న సురేష్ తదితరులు పాల్గొని మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## మృతురాలి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



**కల్వకుర్తి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండల పరిధిలోని ఎల్లికల్ గ్రామానికి చెందిన గోరటి ఇధమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉప్పల టీమ్ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న ఆయన, బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు ఈ క్లిష్ట సమయంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం తన వంతు సహాయంగా ఆర్థిక సాయాన్ని అందించి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనిల్ దాదామోని, వార్డు సభ్యులు మద్దెల వెంకటయ్య, సెట్టిపల్లి లోకేశ్వర్, ఆరేకంటి పరమేశ్వర్, ఎముకంటి వెంకటయ్య, అలాగే పబ్బతి రామస్వామి, సైదులు, అశోక్, సురేష్ ఎనమల్ల, కూన వెంకటయ్య, రామకృష్ణ, శరత్ తదితరులు పాల్గొన్నారు

## మృతురాలి కుటుంబానికి ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహాయం



**కల్వకుర్తి, ఆగస్టు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని హనుమా న్‌నగర్ కాలనీకి చెందిన కారగండ్ల సుమతమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, దాచేపల్లి శ్రీనివాసులు, దారమోని గణేష్, ఐలా శేఖర్ గౌడ్, యాకూబ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

శనివారం,
ఆగస్టు 22, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



# వందకోట్ల క్లబ్బులోకి డిసి మూవీ




టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు.

శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస్' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.

# నటి షావుకారు జానకి మృతి

### వయోసంబంధ అస్వస్థతో కన్నుమూత షావుకారు సినిమాతో పేరు స్థిరం




తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె మృతి చెందారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు. టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో జానకి సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్నారు. 'షావుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు.

భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.

# ఇరుముడి ఎమోషనల్ డ్రామా




రవితేజ హీరోగా 'ఇరుముడి' అనే టైటిల్ ప్రకటించినప్పటి నుంచే ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఇందులోని పాటలు, ట్రైలర్‌లో చూపించిన ఫ్యామిలీ ఎమోషన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. కచ్చితంగా రవితేజకి ఇది కమ్‌బ్యాక్ సినిమా అవుతుందని
అందరూ భావించారు. పీలేరు ప్రాంతంలో త్రినాథ్(రవితేజ) ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేస్తూ కూతురు మణెమ్మ(నక్షత్ర), భార్య కావేరి(ప్రియా భవానీ శంకర్)తో ఆనందంగా జీవిస్తుంటాడు. ఆ ప్రాంతంలో అందరి ఆడపిల్లలని తన కూతురులానే చూస్తుంటాడు. తనకు మద్యం అలవాటు ఉంటుంది. కాకపోతే అయ్యప్ప స్వామి మాలలో ఉన్నప్పుడు మాత్రం మందు జోలికి వెళ్లడు. అదే ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా చనిపోతుంది. ఆ మరణం వెనుక ఉన్నది ఎవరు? ఈ చావు త్రినాథ్ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసిందనేది మిగతా కథ. తెలుగులో చాలా క్రైమ్ థ్రిల్లర్స్ వచ్చాయి. కాకపోతే కుటుంబ, అయ్యప్ప మాల నేపథ్యంలో ఒక ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'ఇరుముడి' ప్రత్యేకంగా కనిపిస్తుంది. సినిమా కథ ప్రారంభం ఓ స్కూల్లో టీచర్ సస్పెండ్ అవడంతో మొదలవుతుంది. ఆ తర్వాత కుటుంబం, మణెమ్మతో ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను ఎస్టాబ్లిష్ చేయడానికి కొంత సమయం పడుతుంది. ఎప్పుడైతే పదో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి అనూహ్యంగా చనిపోతుందో, అక్కడి నుంచి కథలో ఉత్కంఠ పెరుగుతుంది. అది విరామానికి వచ్చేసరికి ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి, ఎమోషన్ కలిగిస్తుంది. ఈ కథను దర్శకుడు హ్యాండిల్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. కథలో మంచి ట్విస్టులు రాసుకున్నారు. ఒక హార్ట్ టచింగ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా కథను దర్శకుడు శివ నిర్వాణ నడిపించారు. అదే సమయంలో ఒక బలమైన సందేశం కూడా ఇచ్చారు. ఆ సందేశం కచ్చితంగా గుర్తుపెట్టుకుని పాటించదగ్గదిగా ఉంటుంది. రవితేజ తన మాస్ ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తిగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో నటించారు. త్రినాథ్ పాత్రలో ఆయన పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. ఒకవైపు ఎమోషనల్ తండ్రిగా, మరోవైపు మద్యానికి బానిసైన వ్యక్తిగా, అయ్యప్ప మాల వేసుకున్న భక్తుడిగా, చివర్లో ఒక తండ్రిగా.. తన పాత్రలో చాలా వేరియేషన్స్ ఉన్నాయి. ఆ వేరియేషన్స్ అన్నింటినీ రవితేజ చాలా పరిణతితో కనబరిచారు. అలాగే మణెమ్మ పాత్రలో చేసిన బేబీ నక్షత్ర పాత్ర కూడా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. రవితేజ భార్య పాత్రలో కనిపించిన ప్రియా భవానీ శంకర్ పోషించిన కావేరి పాత్ర కూడా చాలా హుందాగా ఉంటుంది. ఆ పాత్ర ఈ సినిమాకు కావాల్సిన ఎమోషన్‌ను యాడ్ చేసింది. గురుస్వామి పాత్రలో చేసిన సాయికుమార్ పాత్ర ఆయనకు చాలా కొత్తగా, అదే సమయంలో ప్రభావవంతంగా ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో ఆ పాత్రకు దర్శకుడు రాసుకున్న ఒక మలుపు కూడా కథకు బలాన్ని చేకూర్చింది. అలాగే అజయ్ ఘోష్ పాత్ర కూడా కావాల్సిన క్యూరియాసిటీని పెంచింది. మిగతా నటీనటులు పరిధి మేరకు కనిపించారు. సీలేరు ప్రాంతంలో తీసిన చిత్రమిది. అన్ని ఒరిజినల్ లొకేషన్స్ కావడంతో కథ నిజంగా అక్కడే జరుగుతున్నట్టుగా అనుభూతిని కలిగించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.

# హాయ్ చిత్రం ట్రైలర్ విడుదల



లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విష్ణు ఎడవన్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.



# 'స్పిరిట్'లో ప్రకాశ్ రాజ్ లేరు.. క్లారిటీ ఇచ్చిన నిర్మాత

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న 'స్పిరిట్' చిత్రం నుంచి ఒక కీలక అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమాలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ నటించడం లేదని అధికారికంగా స్పష్టత వచ్చింది. చిత్ర నిర్మాత ప్రణయ్ వంగా స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.

ఈ చిత్రంలోని జైలర్ పాత్ర కోసం తొలుత ప్రకాశ్ రాజ్‌ను సంప్రదించినప్పటికీ, కొన్ని కారణాల వల్ల అది సాధ్యపడలేదని ఆయన స్పష్టం చేశారు. గత ఏడాది విడుదలైన టీజర్‌లో ప్రకాశ్ రాజ్ వాయిస్ ఓవర్ వినిపించడంతో ఆయన ఈ ప్రాజెక్టులో భాగమయ్యారని అందరూ భావించారు. అయితే, ఆ తర్వాత ఆయన ఈ సినిమా నుంచి తప్పుకున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా నిర్మాత చేసిన ప్రకటనతో ఆ వార్తలకు బలం చేకూరినట్లయింది.

మరోవైపు 'స్పిరిట్' చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి అతిథి పాత్రలో కనిపించనున్నారంటూ వస్తున్న ఊహాగానాలకు కూడా ప్రణయ్ వంగా తెరదించారు. ఈ సినిమాలో చిరంజీవి ఎలాంటి క్యామియో చేయడం లేదని ఆయన తేల్చి చెప్పారు.

# ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీ భోర్సే

## వార్తలను తోసిపుచ్చిన టీ సీరిస్



టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు తట్టాయి. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది.